సాక్షి ఒడిశా

బుధవారం । 8 । జనవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.7,28,338
బంగారం	1 గ్రాము 50 మిల్లీ గ్రాములు
వెండి	53 గ్రాముల 550 మిల్లీ గ్రాములు

\- భువనేశ్వర్/పూరీ



పుష్ప సోయగం

భువనేశ్వర్‌లోని ఏకామ్ర కానన్ ప్రాంగణంలో పూల ప్రదర్శనను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంగళవారం ప్రారంభించారు.

- IIలో▸



రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ సంక్రమణ లేదు

రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ జాడ లేదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ పేర్కొన్నారు.

- IIలో▸

న్యూస్‌రీల్

ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక భైరవీధిలో ఉన్న గ్రామ దేవత బురదల పోలమ్మ అమ్మవారి హుండీ ఆదాయ లెక్కింపు మంగళవారం జరిగింది. ఆలయ ప్రాంగణంలో అందరి సమక్షంలో హుండీని తెరిచిన సభ్యులు ఈ మేరకు లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు హుండీలో వేసిన కానుకల రూపంలో రూ.1,65,070ల నగదు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తం ఆదాయాన్ని అమ్మవారి పేరిట బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రార్‌గా మహేష్ చంద్ర నాయక్



మహేష్ చంద్ర నాయక్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా అదనపు మేజిస్ట్రేట్ మహేష్ చంద్ర నాయక్ కొరాపుట్ జిల్లా జయపూర్‌లోని విక్రమ్ దేవ్ యునివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గ ఆదేశాలు మంగళవారం జారీ చేసింది. మహేష్ చంద్ర గతంలో జయపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. రాయగడ జిల్లాకి చెందిన మహేష్ చంద్ర అవిభక్త కొరాపుట్ జిల్లాలో అనేక ఏళ్లు జిల్లాస్థాయి ఉన్నతాధికారిగా వివిధ హోదాల్లో పని చేశారు. తన పూర్వీకుల నుంచి వస్తున్న ఆస్తులు మొత్తం తన స్వగ్రామంలో పేదలకు పంచి గతంలో వార్తల్లో నిలిచారు.

శిశువు మృతదేహం లభ్యం



కాలువ గట్టున పడి ఉన్న మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న కాలువ గట్టు వద్ద సోమవారం అర్ధరాత్రి కుక్కలు పీకుతున్న ఒక శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ రీగాన్‌కీండో తన సిబ్బందితో వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. ఎవరైనా ప్రసవ అనంతరం బిడ్డ మృతి చెందిందే ఇలా పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇలా చేయడం నేరమని, నిందితులను పట్టుకొని శిక్షిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

విమానాశ్రయంలో గంజాయి స్వాధీనం



కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి పొట్లాలు

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విలువైన గంజాయి మంగళవారం పట్టుబడింది. మహిళా ప్రయాణికురాలి దగ్గర దీనిని గుర్తించారు. అధికారులకు పట్టుబడిన గంజాయి మార్కెట్ విలువ సుమారు రూ.9 కోట్లు ఉంటుందని అంచనా. ఈ మహిళ కౌలాలంపూర్ నుంచి భువనేశ్వర్ ప్రయాణించినట్లు తేలింది. విచారణ కొనసాగుతోంది. స్థానిక విభాగం అధికారుల తనిఖీలో ఈ అక్రమ రవాణా విషయం గుట్టురట్టు అయింది. నిందిత మహిళ ప్రయాణికురాలు నిషిద్ధ గంజాయిని ఒక సంచిలో పెట్టుకొని ప్రయాణించింది. చిన్న పొట్లాలుగా సంచిలో పేర్చుకుని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మలేషియా కౌలాలంపూర్ నుంచి భువనేశ్వర్ విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు సామాన్ల తనిఖీ సమయంలో ఆమె సామాన్లలో 19 పొట్లాల్లో గంజాయి పట్టుబడింది. దీంతో ఈ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మహిళను అరెస్టు చేశారు. ఈ వ్యవహారం పూర్వాపరాలు వెలుగులోకి తీసుకొచ్చేందుకు అనుబంధ విభాగాల ఉన్నతాధికార వర్గాలు రంగంలోకి దిగాయి.

మాటలు ఘనం.. అభివృద్ధి శూన్యం..!

- మూలుగుతున్న మునిషిపొదొరొ
- మౌలిక సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు



నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు



తాగునీటి కుళాయి దుస్థితి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మునిషిపొదొరొ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస మౌలిక సౌకర్యాలు లేక గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. 2024 మే నెలలో అతిసారంతో ఈ గ్రామానికి చెందిన ఐదుగురు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య బృందాలు ఈ గ్రామంలో పర్యటించి వ్యాధికి గల కారణాలను నిర్ధారించారు. అనంతరం స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రామంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది.

అటకెక్కిన హామీలు

అయితే ఇచ్చిన హామీలు అక్కడికే పరిమితమయ్యాయి. ఘటన జరిగి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఈ గ్రామంలో అభివృద్ధి ఛాయలు కనిపించడం లేదు. సుమారు 35 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో రహదారి కూడా లేకపోవడం విచారకరం. ఇదిలాఉండగా తాగునీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక సౌకర్యాలకు గ్రామస్తులు దూరంగా ఉంటున్నారు. గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల నిర్మాణం కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అయితే గత మూడు నెలలుగా వీటి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికీ పాఠశాల పనులు పూర్తి కాలేదు. పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులకు ఆరోగ్య కేంద్ర భవనం, గ్రామంలో ఎవరైనా ఇంటి ఆవరణలో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, వారు సరిగ్గా పాఠశాలకు రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



మనోరేగ పనుల కోసం వేసిన శిలాఫలకం

ఒక్కటే కుళాయి

ఇదిలాఉండగా ఈ గ్రామంలోని రెండు వీధులకు కేవలం ఒకటే తాగునీటి కుళాయి ఉంది. అది కూడా అపరిశుభ్ర వాతావరణంలో ఉండడంతో గత్యంతరం లేని గ్రామస్తులు అదే నీటిని తాగేందుకు వినియోగిస్తున్నారు. డిఫ్తీరియా వ్యాధితో ఈ గ్రామంలో ఐదుగురు పిల్లలు మృతి చెందిన ఘటనలో దర్యాప్తు చేసిన వైద్య బృందాలు, అపరిశుభ్ర తాగునీటిని తాగడమే వ్యాధికి కారణమని నివేదిక ఇచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించి తాగునీటి సౌకర్యాన్ని మెరుగు పరచాలన్న సంగతి మరిచిపోవడం విచారకరం. మనోరేగ పనుల ద్వారా గ్రామస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారికి ఆర్థిక సహకారం అందించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయి. అందువలన ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

- ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పర్లాకిమిడి: అకాల వర్షాలకు రంగుమారిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి అధికారులు కొనుగోలు చేయాలని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కోరారు. పట్టణంలోని సంతపేట వద్ద ప్రాంతీయ మార్కెటీ కమిటీ యార్డు (ఆర్‌ఎంసీఎస్) వద్ద జరిగిన జిల్లా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావులు పాల్గొని ప్రారంభించారు. ఆర్‌ఎంసీ కార్యదర్శి రేబతీమోహన్ రౌత్ అధ్యక్షత వహించగా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల కుమార్ నాయక్, డీఆర్‌సీఎస్ హరిహరశెఠి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అకౌంట్లలో జమ

ఎఫ్‌ఏక్యూ ధాన్యం క్వింటాకు రూ.2,300 మరియు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.800లు కలిపి రైతుల అకౌంట్లలో జమ చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల కుమార్ నాయక్ వెల్లడించారు. జిల్లాలో 45 ప్యాక్స్ (పంచాయితీ సోసైటీలు), 11 మంది మిల్లర్లు ద్వారా ఖరీఫ్ పంటను కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కొందరు రైతులు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకున్నారన్నారు. ధాన్యాన్ని ఎండబెట్టి మండీలకు పంపించాలని సూచించారు. అధికారులు కూడా మండీల వద్ద రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు సహకరించాలన్నారు. ప్రభుత్వం ఖరీఫ్ మొదటి పర్యాయం 5.88 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు లక్ష్యం పెట్టుకున్నట్టు కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తెలిపారు.

రైతుల గగ్గోలు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల కుమార్ నాయక్ మాట్లాడుతుండగా ఒక్కసారిగా రైతులు గగ్గోలు పెట్టారు. మకర సంక్రాంతి సమీపిస్తున్నా ఖరీఫ్ పంటను అధికారులు కొనుగోలు చేయకుండా ఎఫ్‌ఏక్యూ పరీక్షలు చేస్తామని అనడం సమంజసం కాదన్నారు. స్వయంగా సీఎం మోహన్ చరణ్ మాఝీ గుసాని సమితిలో పర్యటించి రంగుమారిన ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినా, అధికారులు విపరీత ధోరణితో మాట్లాడుతున్నారన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ పట్నాయక్, జెడ్పీటీసీ(గుసాని) ఎస్.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

ఆధునిక హంగులు



పర్లాకిమిడి రైల్వేస్టేషన్ మెయిన్ బిల్డింగ్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు పూర్తి కానున్నాయి. రైల్వేస్టేషన్ మెయిన్ బిల్డింగ్, ప్లాట్ ఫారం పనులు 90 శాతం పూర్తవ్వగా, ఓవర్ బ్రిడ్జి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. రైల్వేస్టేషన్ ఆవరణలో పార్కింగ్, పాత స్టీమ్ ఇంజిన్ నమూనా, రహదారి పనులు కొనసాగుతున్నాయి. పీఎం అమృత్ భారత్ పథకం కింద ఒడిశాలోని 21 రైల్వేస్టేషన్ల అభివృద్ధికి రెండో పర్యాయంలో సుమారు రూ.30 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఈస్టుకోస్టు రైల్వే డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలియజేశారు. ఏప్రిల్ ఒకటి నాటికి పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆధునికరణ పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు.



కొనసాగుతున్న ఓవర్ బ్రిడ్జి పనులు



పూర్తవుతున్న ప్లాట్‌ఫారం పనులు

రోడ్డు ప్రమాదంలో 2 వాహనాలు దగ్ధం

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా బరిపద ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ట్రక్కు, బైక్ ఢీకొన్నాయి. 18వ నంబర్ జాతీయ రహదారి జగన్నాథ ఖుంటా కూడలి ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరగడంతో బైక్ బ్లాస్ట్ అయింది. బైక్ చోదకుడు ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ట్రక్కు డ్రైవరు పత్తా లేకుండా పోయింది. మంటల్లో ఈ రెండు వాహనాలు దగ్ధం అయ్యాయి.



మంటల్లో దగ్ధమైన బైక్, ట్రక్కు

ఓపీఎస్‌సీ పరీక్ష జోన్‌గా జయపురం

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్సీ) కొరాపుట్ జిల్లా పరిధిలో జయపురం కొత్త పరీక్ష జోన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ చొరవతో మారుమూల ప్రాంతాల నుంచి అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు అయ్యేందుకు రవాణా ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రస్తుతం ఓపీఎస్సీ బాలాసోర్, బరంపురం, భువనేశ్వర్, కటక్ మరియు సంబలపూర్ ప్రాంతాల్లో పరీక్ష జోన్లను నిర్వహిస్తోంది. కొరాపుట్ జిల్లా జయపురం చేరికతో ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల జోన్ పరిధి 6కు విస్తరించింది. ఈనెల 1న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో జయపురంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు ఓపీఎస్సీ అధికారిక నోటిఫికేషన్ ద్వారా జయపురం కొత్త జోన్ స్థాపనను నిర్ధారిస్తూ సన్నాహాలు చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది.

రాష్ట్రంలో కేంద్రమంత్రి జయశంకర్ పర్యటన



జగన్నాథుని మహా ప్రసాదంతో కేంద్రమంత్రి జయ శంకర్

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న ప్రవాసీ భారతీయ దివస్ పురస్కరించుకొని విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ రాష్ట్రంలో పర్యటించారు. దీనిలో భాగంగా ప్రఖ్యాత కోణార్క్ సూర్య దేవాలయం, పూరీ జగన్నాథ ఆలయాలను మంగళవారం సందర్శించారు. శ్రీజగన్నాథుని దర్శించుకుని పూజాదులు నిర్వహించారు. ప్రపంచ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన ప్రవాస భారతీయుల్లో సాంస్కృతిక బంధాలను కోణార్క్ కళాఖండం పటిష్టపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ వారసత్వంపై లోతైన అవగాహనను ప్రేరేపిస్తుందన్నారు.

రాజధాని చేరుకున్న ప్రవాస భారతీయులు



కోణార్కు సూర్య దేవాలయం పర్యటనలో కేంద్రమంత్రి జయ శంకర్

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐ) వార్షిక ప్రవాసీ భారతీయ దివస్ (పీబీడీ) వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రాజధాని నగరంలో బస చేశారు. దీనిలో భాగంగా పవిత్ర పుణ్యక్షేత్రం పూరీ సందర్శించి మూల విరాటులను దర్శించుకున్నారు. వీరికి స్థానికులు ఆత్మీయంగా ఆహ్వానం పలికి మనసు దోచుకున్నారు. అనేక మంది సందర్శకులు ఆలయం ఆధ్యాత్మిక వాతావరణం ఎంతో ప్రశాంతత ప్రసాదించిందన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

- జెడ్పీ అధ్యక్షురాలు మాఝి
- ప్రారంభమైన జిల్లాస్థాయి కృషి మేళ



కృషిమేళ స్వాగత ద్వారం



సబ్సిడీ ట్రాక్టర్లు

రాయగడ: రైతుల కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు వినియోగించుకోవాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అన్నారు. స్థానిక ఐఏసీఆర్ మైదానంలో జిల్లాస్థాయి కృషి మేళా, వ్యవసాయ పరికరాల ప్రదర్శన కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ పరికరాలతో రైతులు సాగుచేసి అధిక లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంలో కొత్త పోకడలు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా రైతులు వాటిని అవలంభించాలని హితవు పలికారు. ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ రంగం ఎంతో దోహదపడుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీలను కూడా అందిస్తోందన్నారు. ఆధునిక వ్యవసాయ పరికరాలను ఈ సబ్సిడీల ద్వారా ఖరీదు చేసుకొని వ్యవసాయ పనులకు వినియోగించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడినిచ్చే వ్యవసాయ పంటలతో పాటు సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు.



వ్యవసాయ పరికరాల ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ అధ్యక్షురాలు సరస్వతీ, ఏడీఎం రైతా, పీడీ డాక్టర్ బాగ్ తదితరులు

అధికారులు అందుబాటులో ఉండాలి

వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ రంగంలో కొత్త ఒరవడులను సృష్టించాలంటే, అందుకు సంబంధిత శాఖ అధికారుల ప్రోత్సాహకాలు ఎంతో అవసరమన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే కోళ్లు, పందుల పెంపకంలో తగిన మెలకువలు నేర్చుకుంటే ఆ రంగంలో రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ మేళా ఈనెల 11వ తేదీతో ముగుస్తుంది.



వ్యవసాయ ప్రదర్శన



ఉద్యానవనం ద్వారా పూల తోటల ప్రదర్శన

క్లుప్తంగా

విద్యుత్ రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు

అరసవల్లి: 2025–26 వార్షిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. హైబ్రిడ్ విధానంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్, అకౌంట్స్ అధికారి లీలామోహన మురళి తదితరులు పాల్గొన్నారు. వినియోగదారుల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకెళ్తామని ఎస్ఈ ప్రకటించారు. ఈ నెల 8, 10 తేదిల్లో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజనల్ కేంద్రాల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని తెలిపారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి నెల రోజుల పాటు మగ్గం వర్కు, బ్యూటీ పార్లర్ నిర్వహణ, కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని, పూర్తి వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గంజాయి నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : గతేదాది సెప్టెంబరు 8న ఆపరేషన్ గంజాయి పేరుతో ఒకటో పట్టణ పోలీసులు ఏడుగురు జిల్లావాసులను, ఇద్దరు ఒడిశాకు చెందిన నిందితులను రిమాండ్‌కు పంపి 22 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వీరితో పాటు కేసుతో సంబంధం ఉన్న మరో ముగ్గురు అప్పుడే పరారయ్యారు. వీరిలో నగరానికి చెందిన జలగడుగుల తారా వికాస్ అలియాస్ వికాస్ మంగళవారం వచ్చాడని సమాచారం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు గాలించారు. ఎస్ఐ హరికృష్ణ తమ సిబ్బందితో కలసి వికాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా వ్యాపారి సీనా నుంచి అదే రాష్ట్రానికి చెందిన హరీష్ గుంత, బంక జోసెఫ్‌లు రూ. 3 వేలకు కిలో గంజాయిని కొని జిల్లాకేంద్రానికి తెచ్చి వికాస్‌తో పాటు మరికొందరికి రూ.5 వేలకు అమ్మేవారు. వికాస్ తదితరులు 30 గ్రాముల గంజాయి ప్యాకెట్టును రూ.400కు (కిలో రూ.13,300) నగరంలో అమ్ముకుని డబ్బులు చేసుకునేవారు. వికాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎం.హరికృష్ణ మంగళవారం వెల్లడించారు.

మహిళ ఆత్మహత్య



గార: అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతూ ఆర్థికంగా భారమవుతున్నానన్న ఆలోచనతో సూపర్‌వ్యాస్మాల్ పేను మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బందరువానిపేట గ్రామానికి చెందిన కోనాడ బోడెమ్మ (54) గుండె, కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సూపర్ వ్యాస్మాల్ తాగింది. కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు సందెయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ మూకాళ్ల చిరంజీవిరావు తెలిపారు.

ఆటో బోల్తాపడి ముగ్గురు విద్యార్థులకు గాయాలు

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం వద్ద మంగళవారం ఆటో బోల్తాపడి ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజాం నుంచి పొందూరు వైపు వెళ్తున్న ఆరుగురు విద్యార్థులు ఎక్కారు. పాలఖ్యండాం వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తాపడటంతో అందులో ఉన్న పేకల లిఖిత, అంబల్ల అశ్వని, బొంతల జయలక్ష్మికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

13న ఉత్తరాంధ్ర స్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు

కవిటి: మండలంలోని ఆర్.బైరిపురంలో ఈ నెల 13న ఉత్తరాంధ్ర స్థాయి ఓపెన్‌క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు బైరిపురం కల్చరల్ క్లబ్(బీసీసీ) ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైస్ సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.9000, రూ.7000, రూ.5000 నగదు బహుమతులు, షీల్డ్‌లు అందిస్తామని తెలిపారు. ప్రవేశ రుసుము లేదని, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామని, పూర్తి వివరాలకు 9494165120, 9493652151 నంబర్లను సంప్రదించాలని కోరారు.



పూల సీతాకోక చిలుక స్వాగత ద్వారం



ఏకామ్ర కానన్ పుష్ప ప్రదర్శన ప్రాంగణం



బొయితా బొందానా ప్రతీక అలంకరణ



పుష్ప ప్రదర్శన ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

పుష్ప సోయగం

భువనేశ్వర్‌లోని ఏకామ్ర కానన్ ప్రాంగణంలో పూల ప్రదర్శనను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంగళవారం ప్రారంభించారు. ప్రవాస భారతీయుల దినోత్సవం పురస్కరించుకొని రాజధాని నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు ఏకామ్ర కానన్ ప్రాంగణంలో వివిధ రకాల పూలతో అలంకరించారు. సుగంధిత, అలంకారం, ఆకర్షణీయమైన 500 రకాల పైబడిన రంగురంగుల పూల ప్రదర్శన అబ్బురపరుస్తోంది. సందర్శకులను ఆకట్టుకునే పలు ఆకృతులతో పుష్ప వేదికలు పూల సుగంధంతో గుభాలిస్తున్నాయి. వీటిలో పలు జాతీయ, అంతర్జాతీయ పూలని ప్రదర్శించడం విశేషం. ఈనెల 11వ తేదీ వరకు ఈ ప్రదర్శన నిరవధికంగా కొనసాగుతుంది.

- భువనేశ్వర్



పుష్ప జగన్నాథుడు



అబ్బుర పరుస్తున్న పూల ప్రదర్శన



ఆకట్టుకుంటున్న పూలవీణ



ఆకర్షణీయ పూలపాను



ఆకట్టుకుంటున్న పూల భామ

రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ సంక్రమణ లేదు

- ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలో హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) జాడ లేదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ పేర్కొన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో హెచ్‌ఎంపీవీ సంక్రమణ నేపథ్యంలో స్థానిక లోకసేవా భవన్‌లో రాష్ట్ర ఆరోగ్య శాఖ అత్యవసరంగా సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి, ప్రజారోగ్య సేవల డైరెక్టర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరస్ వలన ఏదైనా విపత్కర పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు. తక్షణమే ఉన్నత చికిత్స, వైద్య సదుపాయాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ స్థాయిలో కూడ ఈ వైరస్ సంక్రమణ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటివరకు దేశంలో



మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్

మూడు నుంచి నాలుగు చోట్ల హెచ్‌ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాల్లో సంప్రదించినట్లు పేర్కొన్నారు. సంక్రమణ చికిత్స కోసం ప్రత్యేక వైద్యుల బృందాలు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి. ఏదైనా విపత్కర పరిస్థితి ఏర్పడితే, దానిని రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తాయని తెలిపారు.

తక్షణ చికిత్స నివారణోపాయం

ప్రజలు దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతుంటే వెంటనే వైద్యం చేయించుకోవడం భయాందోళనలు కలిగిస్తున్న వైరస్ సంక్రమణ తీవ్రతకు కళ్లెం వేసే తొలి సోపానంగా ప్రజలను సూచించారు. ఎవరైనా దగ్గు, జలుబు మరియు జ్వరంతో బాధపడుతుంటే, వారు ప్రాథమిక చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. హెచ్‌ఎంపీవీ వల్ల ఉత్పన్నమయ్యే ఎలాంటి అనూహ్య పరిస్థితులనైనా పరిష్కరించడానికి కేంద్రం, రాష్ట్రం రెండూ పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని అభయమిచ్చారు. రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా మాట్లాడుతూ ఒడిశాలో ఇప్పటివరకు హెచ్‌ఎంపీవీ కేసులు ఏవీ గుర్తించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట నిఘా చర్యలు చేపట్టామని తెలిపారు. దేశంలో శ్వాసకోశ వ్యాధుల ప్రస్తుత పరిస్థితిని, దాని నిర్వహణ కోసం ప్రజారోగ్య చర్యల స్థితిని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి సమీక్షించారు. నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలని రాష్ట్రాలకు సూచించారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో తొలి డబుల్ డెక్కర్ బస్సు



బస్సు సేవలను ప్రారంభిస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా డబుల్ డెక్కర్ బస్సు సేవలను స్థానిక గఢాకొణా బస్ డిపో నుంచి రాజధాని ప్రాంత నగర రవాణా (క్రట్) పతాకం ఊపి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంగళవారం ప్రారంభించారు. అనంతరం బస్సులో ఆయన ప్రయాణించారు. మొత్తం 5 డబుల్ డెక్కర్ బస్సులు, 10 హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సులు మరియు 25 శ్రీజగన్నాథ ఆలయం బస్సు సేవలు ప్రారంభం అయ్యాయి. రవాణా సులభతరం చేసే దృక్పథంతో అధునాతన బస్సుల రవాణాకు శ్రీకారం చుట్టడం విశేషంగా పేర్కొన్నారు.



బస్సులో ప్రయాణిస్తున్న దృశ్యం

కొరాపుట్‌లో సుకాంత్ మజుందార్ పర్యటన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సుకాంత్ మజుందార్ తదితరులు

కొరాపుట్: కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ కొరాపుట్ జిల్లాలో మంగళవారం పర్యటించారు. దమంజోడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే రాజ్‌పుట్ గ్రామంలో మిల్లెట్ మిషన్ పరిశీలించారు. లుంగిరి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయగడ: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని సకాలంలో పరిష్కరించే విధంగా అంతా కలిసికట్టుగా కృషి చేయాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి నీలాంచల్ మిశ్రా అన్నారు. స్థానిక విద్యుత్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సంఘం 80వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా జాతీయ పతాకాన్ని సంఘం ఉపాధ్యక్షురాలు బి.సుజాత ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రవాస భారతీయుల సందడి



పూరీ సాగర తీరంలో ప్రవాస భారతీయులకు స్వాగతం పలుకుతూ మానస్ కుమార్ సాహు ఆవిష్కరించిన సైకత శిల్పం

భువనేశ్వర్: ప్రవాస భారతీయ దినోత్సవం పురస్కరించుకుని పలు ప్రపంచ దేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు రాష్ట్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వీరంతా చిలికా సరసులో పడవ షికారు చేశారు. ఖుర్దా జిల్లా మంగళాజోడి ద్వీపంలో అతిథి పక్షుల గుంపులను ప్రత్యక్షంగా తిలకించేందుకు ముచ్చట పడ్డారు.



సరస్సులో షికారు చేస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందుకున్న భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు

పర్లాకిమిడి: జిల్లాలో భవన కార్మికుల కుటుంబాలకు సీఎం నిర్మాణ కల్యాణ పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయం కలెక్టర్ బిజయ కుమార్ దాస్ మంగళవారం అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జిల్లాలోని 406 మంది కుటుంబాలకు వివాహ ఖర్చులు, ప్రసూతి, అంతిమ సంస్కార ఖర్చులు రూ.1,04,92,300లు అందజేశారు. అంతేకాకుండా భవన కార్మికుల కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యకు రూ.14,52,600 చెక్కు అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి భారతీ బెహరా, అసిస్టెంటు లేబర్ ఆఫీసర్ మదన్ మోహన్ టుడు, అమిత్ కుమార్ నాయక్, డీఐపీఆర్వో ప్రదిప్త గురుమయి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మల్కన్‌గిరి తొలి చైర్మన్ మృతి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పరిషత్ తొలి అధ్యక్షుడు నవీన్ మడ్కమి(92) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పోడియ సమితి గోటాన్‌పల్లి గ్రామంలో చివరి శ్వాస విడిచారు. మల్కన్‌గిరిని అవిభక్త కొరాపుట్ జిల్లా నుంచి 1992లో విభజించి జిల్లాగా చేసిన తర్వాత తొలి జిల్లా పరిషత్ చైర్‌మెన్‌గా ఆయన కాంగ్రెస్ తరుపున గెలిచారు. అలాగే పలుమార్లు సమితి సభ్యుడిగా, నాలుగు సార్లు జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఉన్నా రు. ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.



నవీన్ మడ్కమి మృతదేహం

రహదారి భద్రతపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. స్థానిక బస్టాండ్ నుంచి జిల్లా పోలీసు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు.

రెండు ద్విచక్ర వాహనాలకు జరిమానా

జయపురం: శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న రెండు ద్విచక్ర వాహనాలు(బుల్లెట్)పై జయపురం పట్టణ పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా వాహన చోదకులకు రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. కంపెనీ సైలెన్సర్లు తొలగించి, అధిక శబ్దం కోసం వేరే కంపెనీల సైలెన్సర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

ఉత్సాహంగా పారా అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాస్థాయి పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో ఈ ఎంపికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ప్రారంభించారు. రన్నింగ్, జంప్స్, త్రోస్ అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో జరిగిన ఈ పోటీల్లో 60 మంది పారా క్రీడాకారులు పాల్గొనగా ఉన్నత ప్రతిభ కనబరచిన 31 మందిని రాష్ట్రపోటీలకు ఎంపికచేశారు. ఈ నెల 30న గుంటూరులో జరిగే రాష్ట్ర పోటీల్లో వీరంతా ప్రాతినిధ్యం వహిస్తారని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్షుడు టి.రాము, ఎస్.గిరిధర్, కార్యదర్శి డి.అచ్యుతరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.స్రవంతి, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, ఎస్.రాజేష్ ట్రాఫిక్ జామ్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అరసవల్లి సెక్రటరీ మణిశర్మ, సాయిబాబా, చింతు, గణపతి తదితరులు పాల్గొన్నారు



ఎంపికైన పారా అథ్లెట్స్‌తో అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు

అర్చకులకు అండగా..!

- ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ
- రాష్ట్రవ్యాప్తంగా 80 వేల మంది సభ్యత్వం
- జిల్లాలో సభ్యత్వం పొందిన వారు 5,000 మంది
- సభ్యత్వం ఉంటే 60ఏళ్ల వరకు ఉచిత బీమా రూ.30వేలు
- జిల్లాలో రూ.5 కోట్లు రుణాలు అందజేసిన సొసైటీ



బ్రాహ్మణ సంఘం సభ్యులకు సొసైటీ సేవలు వివరిస్తున్న బీఎంతో పాటు సభ్యులు గ్రూప్

వేపాడ: చాలీచాలని సంపాదనతో కుటుంబాలను నెట్టుకొస్తున్న పేద బ్రాహ్మణులకు ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అండగా నిలుస్తోంది. వారి వ్యక్తిగత అవసరాలకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తూ సహాయ పడుతోంది. 2016లో ప్రారంభమైన ఈ సైసైటీలో నేడు విజయనగరం జిల్లాలో ఐదువేల మంది సభ్యత్వం పొందడంతో ఐదు కోట్ల రూపాయల మేర రుణాలు బ్రాహ్మణులకు వివిధ పథకాల ద్వారా అందిస్తూ ఆదుకుంటోంది. రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వం గల ప్రాథమిక సహకార సంఘంగా గుర్తింపు పొంది బ్రాహ్మణుల ఆర్థిక అవసరాలు తీర్చడానికి సొసైటీ దోహద పడుతోంది. సొసైటీలో సభ్యత్వం పొందడానికి రూ.600 చెల్లించి సభ్యుడిగా చేరవచ్చు. సభ్యుల వాటా ధనంగా రూ.500 ప్రవేశ రుసుంగా రూ.100 వెరశి రూ.600 చెల్లించాల్సి ఉంది. సభ్యుడిగా చేరిన వ్యక్తికి 60ఏళ్ల వరకు ఉచిత బీమా సదుపాయాన్ని సొసైటీ కల్పిస్తోంది. సభ్యత్వం పొందిన వ్యక్తి మరణిస్తే రూ.30 వేలు బీమా పరిహారం అందిస్తుంది. అలాగే పొదుపు ఖాతా ప్రారంభిస్తే కనీస నిల్వ రూ.100తో ప్రారంభించుకోవచ్చు. ఖాతాపై సాలీనా 4.5శాతం వడ్డీని సొసైటీ చెల్లిస్తుంది. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ సదుపాయం, రికరింగ్ డిపాజిట్ సదుపాయాన్ని సొసైటీ కల్పిస్తోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు 5 నుంచి 9శాతం, సీనియర్ సిటిజన్లకు 0.5శాతం అదనంగా చెల్లిస్తోంది. సొసైటీ బ్రాహ్మణులకు పలురకాల పథకాల పేరుతో రుణాలు మంజూరు చేస్తోంది.

సేవలు సద్వినియోగం చేసుకోండి



క్రెడిట్ సొసైటీ బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి. 18 ఏళ్లు నిండిన ప్రతి బ్రాహ్మణ సభ్యుడు సభ్యత్వం తీసుకుని జీవితకాలం ఉచిత బీమా సదుపాయం పొందాలి. జిల్లాలో ఐదు వేలమంది సభ్యత్వం పొందారు. ఐదు కోట్ల రుణాలు అందించాం. వివిధ పథకాల ద్వారా బ్రాహ్మణులకు అందిస్తున్న రుణాలు, ఆర్.డి, పొదుపు ఖాతాలు వినియోగించుకోవాలి. క్రెడిట్ సొసైటీ పురోభివృద్ధికి బ్రాహ్మణుల సహకారం అవసరం.

– ఎం.వెంకట నరసింహమూర్తి, మేనేజర్, బ్రాహ్మణ కో.ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, విజయనగరం

రుణ పథకాల వివరాలు

అరుంధతి సూక్ష్మ రుణ పథకం

బ్రాహ్మణ మహిళల సాధికారతకు, ఉపాధి పొందేందుకు ముగ్గురు సభ్యులకు గరిష్ఠంగా రూ.45వేల రుణం ఇస్తారు. సకాలంలో రుణం చెల్లిస్తే రుణమొత్తం రూ.75 వేలు, రూ.ఒకలక్ష, రూ.1.50లక్షలు, రెండు లక్షలు, రూ.2.50లక్షలుగా పెంచుతారు.

వశిష్ట సూక్ష్మ రుణ పథకం

బ్రాహ్మణ పురుషుల స్వయం ఉపాధి కోసం ముగ్గురు కలిపి ఒక గ్రూపుగా రుణం అందిస్తారు. ఇది కూడా అరుంధతి పద్ధతిలో రుణాలు ఇస్తారు.

అర్చక మిత్ర పథకం

వివిధ దేవాలయాల్లో పే స్కేల్‌పై పనిచేస్తున్న అర్చకులకు 18 నెలల గ్రాస్ శాలరీ గరిష్ఠంగా రూ.10 లక్షలు..ఏది తక్కువ అయితే వారి రుణ అర్హతను బట్టి 10.5శాతం వడ్డీతో వ్యక్తిగత రుణం ఇస్తారు.

పురోహిత పథకం

నలుగురు పురోహితులకు రూ.1.60 లక్షల రుణం 24నెలల్లో చెల్లించే పద్ధతిలో ఇస్తారు. అలాగే బ్రాహ్మణ ఎంప్లాయిస్, బిజినెస్, ఆస్తి తనఖా, బంగారు అభరణాలు, ప్రాజెక్ట్ ఫైనాన్స్, ఉన్నత విద్య తదితర రుణాలు అందిస్తూ బ్రాహ్మణులకు సొసైటీ సహాయపడుతోంది. వృత్తి నిపుణుల రుణ పథకంలో భాగంగా సమాచార మిత్ర, ఆచార్యమిత్ర, పథకాలు అందిస్తోంది. జర్నలిజం రంగంలో ఉన్నవారికి వ్యక్తిగతంగా ఏభైవేల రూపాయల రుణం ఇస్తోంది. ఆ రుణాన్ని 24నెలల్లో జమ చేయాల్సి ఉంది. ఆచార్యమిత్ర అంటే ప్రైవేట్ ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న వారికి రుణం అందిస్తోంది. ఇలా బ్రాహ్మణులకు అన్నివిధాలా సొసైటీ సహకారం అందిస్తోంది.

ఆర్థికంగా ఆసరా పొందాను



క్రెడిట్ సొసైటీలో వశిష్ట సూక్ష్మ రుణ పథకంలో ముగ్గురు సభ్యులం రుణం పొందాం. కరోనా లాంటి ఆర్థిక ఇబ్బందుల్లో రుణం బాగా సహాయపడింది. తక్కువ వడ్డీతో ఇస్తున్న రుణం సకాలంలో చెల్లిస్తున్నందున రుణాన్ని పెంచి ఆర్థికంగా ఆదుకోవడంలో సొసైటీ ఉపయోగపడింది.

– వ్యాకరణం సన్యాసిరావు, పురోహితుడు, ఎస్‌కేఆర్‌పురం, వేపాడ మండలం

క్లుప్తంగా

ఈనెల 10 నుంచి మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడా ఎంపికలు

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 10 నుంచి గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్ వద్ద పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు మాస్టర్ అథ్లెటిక్స్ పార్వతీపురం మన్యం జిల్లా అసోసాయేషన్ అధ్యక్షుడు వి.విజయభాస్కరరావు, కార్యదర్శి పత్తిక చంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ మీట్ కోసం ఈ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తరఫున నిర్వహించే ఈ ఎంపిక పోటీల్లో క్రీడాకారులు ఎవరైనా పాల్గొనవచ్చని, 30 నుంచి 100 ఏళ్ల వయస్సు గల మహిళలు, పురుషులకు 100, 200,400, 800 మీటర్లలో ఈవెంట్స్ నిర్వహించ నున్నామన్నారు. అలాగే లాంగ్ జంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్, హామర్ త్రోలో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనేవారు వారి ఏజ్ ప్రూఫ్ తీసుకురావాలని, ఇతర వివరాల కోసం ఫోన్ 9490026935 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలికకు డీఎంహెచ్ఓ పరామర్శ



సర్వజన ఆస్పత్రిలో బాలికను పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ జీవన రాణి

విజయనగరం ఫోర్ట్: కొత్తవలస మండల కేంద్రంలోని బీసీ సంక్షేమబాలికల వసతిగృహానికి చెందిన విద్యార్థిని షర్మిల పురుగు మందు తాగి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆ బాలికను డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవన రాణి మంగళవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్యం గురించి వైద్యులను ఆడిగి తెలుసుకున్నారు. బాలికకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. పరామర్శించిన వారిలో డీఈఓ మాణిక్యలనాయుడు తదితరులు ఉన్నారు.

రైల్వేట్రాక్ దాటిన ఏనుగుల గుంపు



రైల్వేట్రాక్ దాటుతున్న ఏనుగుల గుంపు

కొమరాడ: ఇటీవల జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో సంచారం చేసిన ఏనుగుల గుంపు మళ్లీ కొమరాడ మండలంలో అడుగు పెట్టాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వేకువ జామున రైల్వే ట్రాక్ దాటి అర్తాం ఫారెస్టు నుంచి కుమ్మరిగుంట గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరించాయి. ఈ ప్రాంతంలో కూరగాయల సాగు ఎక్కువగా ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏనుగుల గుంపును తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ధనలక్ష్మి



ధనలక్ష్మిని అభినందిస్తున్న హెచ్ఎం శ్రీదేవి, పీడీ మల్లికార్జున రావు

గుర్ల: అండర్-14 జాతీయస్థాయి ఖోఖో పోటీలకు గరికివలస హైస్కూల్ విద్యార్థి ఎం.ధనలక్ష్మి ఎంపికైనట్లు పీడీ మల్లికార్జున రావు సోమవారం తెలిపారు. గత నవంబర్ నెలలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో రాణించడంతో జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 10 నుంచి 13 వరకు మహరాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో ఆమె పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు మండల ధనలక్ష్మిని హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

హెచ్ఎంపీవీపై ఆందోళన వద్దు

- డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటా న్యూమో వైరస్) పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవన రాణి చెప్పారు. కోవిడ్ సమయంలో తీసుకున్న మాదిరిగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న హెచ్ఎంపీవీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాస్కులు ధరించడం, చేతుల శుభ్రత, సమూహాలకు దూరంగా ఉండడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను అదుపు చేసేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. ఏ వ్యాధిని అరికట్టాలన్నా, అదుపు చేయాలన్నా ప్రజల సహకారం తప్పనిసరి అని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రజలకు 24 గంటలూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాన్నారు. ప్రాణాంతకమైన కేన్సర్‌ను త్వరితగతిన గుర్తించగలిగితే నయం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. చాలా మంది కేన్సర్ 3, 4 స్టేజీల వరకు గుర్తించలేకపోతున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణశాఖాధికారి డాక్టర్ కె.రాణి పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు నలుగురి ఎంపిక



జాతీయ వాలీబాల్ పోటీలకు ఏపీ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారుడు మనోజ్



విజయలక్ష్మి



ప్రవల్లిక



జార్ఖండ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్న సాగర్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల వాలీబాల్ పోటీలకు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మనోజ్, విజయలక్ష్మి, ప్రవల్లికలు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫునుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా.. విజయనగరం జిల్లాకు చెందిన మరో క్రీడాకారుడు సాగర్ జార్ఖండ్ జట్టు తరఫున తలపడనున్నాడు. ఎంపికైన నలుగురు క్రీడాకారులు ఈనెల 7వ తేదీ నుంచి రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరగనున్న జాతీయ సీనియర్స్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పోటీ పడనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారుల పట్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గవర సూరిబాబు, కార్యదర్శి కేవీఏఎన్ రాజులు హర్షం వ్యక్తం చేశారు సీనియర్స్ జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి విజయలక్ష్మి త్వరలో అంతర్జాతీయ స్థాయిలో థాయిలాండ్‌లో జరగనున్న కోచింగ్ క్యాంప్‌లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుండడం విశేషం. మొదటిసారిగా విజయనగరం వాలీబాల్ చరిత్రలో నలుగురు క్రీడాకారులు సీనియర్స్ జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సన్యాసినాయుడు, కృష్ణంరాజు, భగవాన్‌దాస్‌లు అభినందనలు తెలియజేశారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జొన్నలస విద్యార్థి ఎంపిక



జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జొన్నవలస క్రీడాకారుడు యోగేంద్ర

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు విజయనగరం మండలంలోని జొన్నవలస పాఠశాలకు చెందిన దాసరి యోగేంద్ర ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 స్కూల్‌గేమ్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు మహారాష్ట్ర రాష్ట్రంలోని కొల్హాపూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు యోగేంద్రను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రామకృష్ణ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారుడు రాణించి విజయనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

విద్యార్థికి వినికిడి లోపం

- ఉపాధ్యాయులు చెంపపై కొట్టడంతో సమస్య
- ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన
- ఎంఈఓ త్రినాథరావుకు ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థి తల్లి



ఎంఈఓ త్రినాథరావుకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి హర్ష తల్లి శివదుర్గ

తెర్లాం: ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న విద్యార్థి ఇంగ్లీషు పదాలు తప్పుగా రాస్తున్నాడనే నెపంతో ప్రిన్సిపాల్, తరగతి ఉపాధ్యాయులు తరచూ చెంపలపై, చెవులపై కొట్టడంతో చెవుల నుంచి నీరు(నాడి) కారడంతోపాటు, వినికిడి లోపం సమస్య వచ్చింది. ఈ సంఘటన తెర్లాం మండలంలో ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. ఇదే విషయాన్ని స్థానిక విలేకరుల సమక్షంలో మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావుకు బాధిత విద్యార్థి తల్లి మంగళవారం మౌఖికంగా ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చుక్కవలస గ్రామానికి చెందిన అల్లబోయిన లక్ష్మణ, శివదుర్గల కుమారుడు హర్షను పెరుమాళికి సమీపంలో ఉన్న పెన్(ప్రైవేట్)స్కూల్‌లో గత ఏడాది యూకేజీలో జాయిన్ చేశారు. ప్రతిరోజూ స్కూల్ బస్సులో గ్రామం నుంచి పాఠశాలకు పంపిస్తున్నారు. ఉపాధ్యాయులు ఇచ్చిన హోమ్‌వర్క్‌లో ఇంగ్లీషు పదాలు తప్పుగా రాస్తున్నాడనే నెపంతో ప్రిన్సిపాల్, తరగతి ఉపాధ్యాయులు ఆ విద్యార్థి చెంపపైనా, చెవులపైనా తరచూ కొట్టేవారు. దీంతో ఆ విద్యార్థి చెవుల నుంచి నీరు కారడంతో పాటు, వినికిడి లోపం వచ్చింది. ఇప్పటికే పలుమార్లు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స కూడా చేయించారు. తమ కుమారుడిని ఉపాధ్యాయులు కొట్టడంతో భయపడి నెల రోజులుగా పాఠశాలకు వెళ్లనని ఏడుస్తున్నాడని, తాను మంగళవారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి వెళ్లగా పాఠశాల ప్రిన్సిపాల్ మా పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, ఎవరూ మమ్మల్ని ప్రశ్నించడంలేదని, మీరే అన్ని విషయాలపై ప్రశ్నిస్తున్నారని, మీ అబ్బాయి టీసీని తీసుకుపొండని, నచ్చిన వారికి ఫిర్యాదు చేసుకోండని దురుసుగా సమాధానమిచ్చారని ఆమె వాపోయింది. విద్యా సంవత్సరం మధ్యలో నా కొడుకు టీసీ తీసుకుని వెళ్లిపోమ్మంటే ఎక్కడికి తీసుకువెళ్లి జాయిన్ చేస్తామని ఎంఈఓను ప్రశ్నించింది.

అన్నీ అబద్ధాలే

ఈ సంఘటనపై పెన్ స్కూల్ కరస్పాండెంట్ కాశినాయుడిని స్థానిక విలేకరులు ఫోన్‌లో వివరణ కోరగా తమ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులను ఆ విధంగా కొట్టరని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే తమ ఉద్దేశమన్నారు. విద్యార్థి తల్లి తెలిపిన విషయాలన్నీ అబద్ధాలేనని, వాస్తవం లేదని స్పష్టం చేశారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతిపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: హుకుంపేట కోదండరామమందిరం వద్ద నివాసం ఉంటున్న మజ్జి సతీష్ పెద్దకుమారుడు మజ్జి జశ్వంత్ (14) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదుచేశామని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చిన జశ్వంత్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందినట్లు బాబు తండ్రి సతీష్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు మంగళవారం బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిందని, రిపోర్టులు వచ్చిన తర్వాత వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లయితే కేసులు నమోదుచేస్తామని సీఐ స్పష్టం చేశారు.

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు, గారెలు, బూరెలతో నివేదన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి నిత్య పూజాదికాలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన గారెలు, బూరెలతో నైవేద్యం సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ.ప్రసాద్ పర్యవేక్షించారు.

కిలోన్నర గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: స్థానిక జేఎన్‌టీయూ పరిసర ప్రాంతంలో ఎఫ్‌సీఐ గోడౌన్స్ సమీపంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

నాటుబండిని లారీ ఢీకొని ఎద్దు మృతి

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామానికి చెందిన గార గౌరునాయుడు నాటుబండితో పార్వతీపురం నుంచి వస్తుండగా గ్రామ సమీపంలో పార్వతీపురం నుంచి కొమరాడ వైపు వస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో నడపడంతో వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో నాటుబండిపై ఉన్న గౌరునాయుడు బయటకు తుళ్లిపోగా గాయాలయ్యాయి. అలాగే ఓ ఎద్దు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఎద్దుకు గాయాలయ్యాయి. ఎస్సై నీలకంఠం దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృతిచెందిన పోలీస్ కుటుంబాలకు 'చేయూత'



బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో పనిచేసి, ఇటీవల మృతిచెందిన హోంగార్డ్, పోలీస్ కానిస్టేబుల్ కుటుంబాలకు చేయూతనందించేందుకు పోలీసు సిబ్బంది పోగుచేసిన మొత్తాన్ని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ, ఆకస్మికంగా, అనారోగ్యంతో మృతిచెందిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ వచ్చేంత వరకూ ఆదుకునేందుకు పోలీసుశాఖలో ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి కొంత మొత్తాన్ని పోగుచేసి వారి కుటుంబాలకు చేయూతగా అందించడం అభినందనీయమన్నారు. బలిజిపేట పీఎస్‌లో హోంగార్డుగా పనిచేసిన బి.నారాయణ ఆకస్మికంగా డిసెంబర్ 6న మృతిచెందారన్నారు. వారి కుటుంబానికి హోంగార్డులు పోగుచేసిన ఒక్కరోజు అలవెన్స్ రూ. 3 లక్షల 30వేల 150 చెక్‌ను ఆయన సతీమణి బి.శారదకు ఎస్పీ వకుల్ జిందర్ అందజేశారు. అదే విధంగా కానిస్టేబుల్‌గా పనిచేసి, అనారోగ్య కారణాలతో నవంబరు 9న మృతిచెందిన కె.తిరుపతినాయుడు కుటుంబానికి రూ.లక్షా 48వేల 300 చెక్‌ను వారి సతీమణి కె.నారాయణమ్మకు అదనపు ఎస్పీ పి.సౌమ్యలత అందజేశారు. కార్యక్రమంలో డీపీఓ సూపరింటెండెంట్ ఏఎస్వీ.ప్రభాకరరావు, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భోగాపురం: విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి జాతి భవిష్యత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీ ఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థులు నిర్వహించిన అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి భవిష్యత్ నిర్మాణంలో విద్యా యొక్క ప్రాధాన్యత గొప్పదని, విద్యార్థులు తమ విద్యార్థులు తమ విద్యా సంస్థలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యా రంగంలో ప్రావీణ్యం సాధించాలన్నారు. అనంతరం నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ సైన్సెస్ కళాశాల ప్రొఫెసర్ వి.గిరిజ శాస్త్రి, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణన్ దేశరాజు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ తేజస్వి వెంకప్పా కట్టిమణి, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐసీటీతో జేఎన్‌టీయూ జీవీ ఒప్పందం

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం చెన్నైలో స్థాపించిన ఐసీటీ అకాడమీతో జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) నైపుణ్యాల అభివృద్ధిపై మౌలిక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ఒప్పంద కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడారు. మానవ వనరుల నైపుణ్యాలను పెంపొందించడంలో ఐసీటీ అకాడమీ సహకరిస్తుందన్నారు. అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించి అకడమిక్, పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్, ఐసీటీ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ జి.సరవణన్, రాష్ట్ర ప్రతినిధి దినకర్ రెడ్డి సంతకాలు చేసి అంగీకార పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో అకడమిక్ ఆడిట్ డైరెక్టర్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, పరిశ్రమ సంబంధాలు, ప్లేస్‌మెంట్స్ ఇన్‌చార్జి డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ జి.జె.నాగరాజు, విశాఖ ప్రాంత సంబంధాల మేనేజర్ యాకాల సురేష్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

10న రామతీర్థం గిరి ప్రదక్షిణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థాన సిబ్బంది
- ఉత్తర ద్వారం నుంచి దర్శనమివ్వనున్న రాములోరు
- ముక్కోటి ఏకాదశి పూజలకు సిద్ధమైన రామక్షేత్రం



గిరిప్రదక్షిణ జరిగే రహదారి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం ముక్కోటి ఏకాదశి పూజలకు ముస్తాబయింది. ఈ నెల 10న మెట్లోత్సవంతో పాటు, స్వామివారి ఉత్తర ద్వారదర్శనం, గిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి చాలా విశిష్టమైనది. భక్తులు కోదండ రామస్వామివారి బోడికొండ చుట్టూ మొత్తం 8 కిలోమీటర్ల మేర రామనామాన్ని జపిస్తూ ప్రదక్షిణ చేస్తారు. అనంతరం బోడికొండపై ఉన్న కోదండ రాముడిని దర్శించుకుంటారు. ఎంతో మంది రుషులు తపస్సు చేసి స్వామివారి అనుగ్రహం పొంది అదే పర్వతంపై వృక్షాలు, శిలలుగా మారిపోయారని, బోడికొండ చుట్టూ ప్రదక్షిణచేస్తే పుణ్యం లభిస్తుందనేది భక్తుల విశ్వాసం. పాండవులు నడయాడిన నేల కావడంతో గిరి పర్వతం చుట్టూ నడిచేందుకు భక్తజనం ఆసక్తిచూపుతోంది.



ఉత్తర రాజగోపురం నుంచి సీతారామస్వామి

దర్శనం

ఈ నెల 10న వేకువజామున 3 గంటలకు స్వామివారికి ఆరాధన, 4 గంటలకు తిరుప్పావై సేవా కాలం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి కార్యక్రమాలను అర్చకులు నిర్వహించనున్నారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణ నడుమ తెల్లవారు జామున 5 గంటలకు స్వామివారి ఉత్తర ద్వారదర్శన కార్యక్రమాన్ని అర్చకులు జరపనున్నారు. ఉదయం 7.30 గంటల వరకు స్వామివారు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం స్వామివారి తిరువీధి ఉత్సవాన్ని జరిపించి ఉదయం 8 గంటలకు భజన, కోలాటం, కీర్తన బృందాలతో బోడికొండ మెట్ల వద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో బోడికొండ మెట్లను శుభ్రపరిచి పసుపు, కుంకుమలతో పూజించి మెట్లోత్సవం, గోపూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం నీలాచాల బోడికొండ చుట్టూ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

పుణ్య ఫలం



ఒకసారి గిరిప్రదక్షిణ చేస్తే ఏక కాలంలో భూమండలం చుట్టూ తిరిగినంత పుణ్యఫలం లభిస్తుంది. స్వామివారి అనుగ్రహం పొందేందుకు నాడు రుషులు తపస్సు చేసి స్వామివారి సన్నిధిలో శిలలు, వృక్షాలుగా మారిపోయారని చరిత్ర చెబుతోంది. అటువంటి పుణ్యస్థలంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తే స్వామివారి అనుగ్రహం తప్పక లభిస్తుంది. రామనామ స్మరణతో ప్రదక్షిణ చేయడం వల్ల ఆ ప్రాంతమంతా పునీతమవుతుంది.

– సాయిరామాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, రామతీర్థం

పదివేల మందికి అన్న ప్రసాదం

ముక్కోటి ఏకాదశి పూజలకు రామతీర్థంలో ఏర్పాట్లు చేశాం. గిరిప్రదక్షిణతో పాటు మెట్లోత్సవాల్లో పాల్గొనే భక్తులకు దారి పొడవునా మంచి నీళ్లను సరఫరా చేస్తాం. భక్తులు గిరి ప్రదక్షిణ చేసే మార్గాన్ని బాగుచేశాం. ఆలయంలో కూడా ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా జరపనున్నాం. సుమారు పది వేల మందికి అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తాం. క్షేత్రానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– వై.శ్రీనివాసరావు, ఈఓ, రామతీర్థం దేవస్థానం